www.methukuseema news
Methuku Seema
# మెతుకు సీమ
నిత్యం - ప్రజల పక్షం
తెలుగు డిజిటల్ దిన పత్రిక
హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :10 | శుక్రవారం | 25 అక్టోబర్ 2024

మెతుకు సీమ
నిత్యం - ప్రజల పక్షం
తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయట పెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలనా కథనాలకు కేరాఫ్ గా నిలిచిన ' మెతుకు సీమ '
విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలంగా దూసుకెళ్తున్న ' మెతుకు సీమ '
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా,
నియోజకవర్గం జిల్లాల వారిగా విలేకరులు కావలెను.
9032793832 , 8848667610

Published from : Hyderabad,Sanagareddy
పేజీలు :05 వేల : 5.00

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ






**- ఉద్యోగ సంఘాల జేఏసీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**
**- పలు అంశాలపై ప్రతినిధులతో చర్చించిన ముఖ్యమంత్రి**

హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు తో కలిసి సీఎం సమావేశమయ్యారు. ఉద్యోగుల డీఏ చెల్లింపు విషయంపై శుక్రవారం సాయంత్రంలోగా నిర్ణయం ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.ఉద్యోగులకు సంబంధించి వివిధ సమస్యల పరిశీలన కోసం కేబినేట్ సబ్ కమిటీని నియమించారు. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ సభ్యులుగా కేశవరావు ప్రత్యేక ఆహ్వానితులుగా కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. దీపావళి తర్వాత శాఖల వారిగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కేబినేట్ సబ్ కమిటీ సమావేశమవుతుంది. జీవో 317 పై మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే సమర్పించిన నివేదికపై కేబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు. జేఏసీ ప్రతినిధులతో జరిగిన సమావేశాల్లో ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఒక్కరోజే 70 విమానాలకు బెదిరింపు కాల్స్

**- 11 రోజుల వ్యవధిలో 250కి పైగా విమానాలకు బెదిరింపు కాల్స్**
**- బెదిరింపు కాల్స్ అన్నీ వట్టివేనని తేలిందన్న కేంద్రమంత్రి**
**- బెదిరింపులకు పాల్పడితే కఠిన శిక్ష విధించేలా మార్పులు తెస్తున్నామని వెల్లడి**



న్యూ ఢిల్లీ,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : విమానాల బెదిరింపులకు పాల్పడేవారిని నోఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఈరోజు దేశంలోని 70 విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ... విమానయాన భద్రతే తమకు మొదటి ప్రాధాన్యత అన్నారు. గత పది రోజులుగా చాలా బెదిరింపు కాల్స్ వచ్చాయని, కానీ అవన్నీ వట్టివేనని తేలిందన్నారు. బెదిరింపు కాల్స్ చేసేవారికి, బెదిరిస్తూ సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవితఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. విమానంలో బోర్డింగ్ అయ్యాక బెదిరింపులకు పాల్పడేవారికి వేసే శిక్షలపై చట్టంలో సెక్షన్లు ఉన్నాయన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా ఇవి వర్తించేలా మార్పులు చేసే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. గతవారం పలు విమానాలకు బెదిరింపులు రావడంతో వేరే మార్గాలకు మళ్లించినట్లు చెప్పారు. ప్రతి దానిని ప్రత్యేకంగా విశ్లేషించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తప్పుడు బెదిరింపులు అయినప్పటికీ ప్రయాణికుల భద్రత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి బెదిరింపు కాల్స్‌పై దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, దేశవ్యాప్తంగా గురువారం ఒక్కరోజే 70కి పైగా విమానాలకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. దేశీయ విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. ఎయిరిండియా, విస్తారా, ఇండిగో, ఆకాశ్ ఎయిర్ సంస్థలకు చెందిన పదుల సంఖ్యలో విమానాలకు నకిలీ బెదిరింపులు వచ్చాయి. 11 రోజుల వ్యవధిలో 250కి పైగా విమానాలకు బెదిరింపు ఫోన్లు వచ్చాయి.

## పార్టీ ఫిరాయించిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాల్సిందే
### - జీవన్ రెడ్డి

**- పార్టీ అధిష్టానం తన ఆవేదనను పరిగణలోకి తీసుకుంటుందనే నమ్మకం ఉందన్న సీనియర్ నేత**
**- క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా నా ఆవేదనను అధిష్టానానికి చెప్పానన్న జీవన్ రెడ్డి**
**- ఏ రాజకీయ పార్టీ అయినా నైతిక విలువలు ఉండాలని వ్యాఖ్య**



హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : ఫిరాయింపులకు పాల్పడిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాల్సిందేనని... చట్టం కూడా అదే చెబుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి అన్నారు. తన ముఖ్య అనుచరుడు హత్యకు గురైనప్పటి నుంచి సొంత పార్టీ ప్రభుత్వంపై జీవన్ రెడ్డి నిప్పులు చెరుగుతున్నారు. తాజాగా, ఆర్టీవీ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... తన ఆవేదనను పరిగణలోకి తీసుకుంటారని, పార్టీ మీద నమ్మకంతోనే అధిష్ఠానానికి తాను ఫిరాయింపులకు సంబంధించి లేఖ రాశానన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలు, తమ పార్టీ ఎన్నికల ప్రణాళికకు అనుగుణంగానే తాను ఫిరాయింపులపై మాట్లాడానన్నారు. రాహుల్ గాంధీపై తనకు నమ్మకం ఉందన్నారు. ఏఐసీసీ అనుమతితోనే చేరికలు జరిగాయన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై కూడా జీవన్ రెడ్డి స్పందించారు. పెద్దల అనుమతి ఉండవచ్చుని... కానీ రాహుల్ గాంధీ ఆలోచననే తాను చెప్పానన్నారు. ఏ రాజకీయ పార్టీకి అయినా నైతిక విలువలు ఉండాలన్నారు. త్యాగాల పునాదులపై కాంగ్రెస్ ఈ స్థాయికి వచ్చిందన్నారు. గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనుకుంటే ఎప్పుడో అయ్యేవారని, కానీ నైతిక విలువల విధానం కావాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పారు. రాహుల్ గాంధీ కాలికి బలపం పట్టుకొని తిరిగి దేశమంతా కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఫిరాయింపులపై వెంటనే చర్యలు ఉండాలని రాహుల్ గాంధీ కూడా చెప్పారు కదా... అంటే ఆయన మాటకు ఇక్కడి ప్రభుత్వం విలువ ఇవ్వడం లేదా? అని మీడియా ప్రతినిధి ప్రశ్నించగా... ఫిరాయింపుల వెనుక ఎవరు ఉన్నారో చూద్దామన్నారు. ఇక్కడ జరుగుతున్న పరిణామాలపై ఓ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా తన ఆవేదనను వ్యక్తం చేశానన్నారు. నా ఆలోచనకు, నా ఆవేదనను పార్టీ గుర్తిస్తుందని నమ్మకం ఉందన్నారు.

## పోలీస్ వ్యవస్థను దిగజార్చినందుకు రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు



- కానిస్టేబుల్ భార్యపై మహిళా కానిస్టేబుల్ చేయి చేసుకునే స్థాయికి దిగజార్చారని విమర్శ
- పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను రేవంత్ రెడ్డి దిగజార్చారని ఆగ్రహం
- కనీసం డీజీపీ అయినా స్పందించాలని విజ్ఞప్తి

2 లో

# పోలీస్ వ్యవస్థను దిగజార్చినందుకు రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు

హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : యూనిఫాంలో ఉన్న ఓ మహిళా కానిస్టేబుల్... న్యాయం కోసం పోరాడుతున్న ఓ కానిస్టేబుల్ భార్యపై చేసుకునే స్థాయికి రాష్ట్ర పోలీస్ వ్యవస్థను దిగజార్చినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజంగా చరిత్రలో నిలిచిపోతారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఖండించదగ్గ విషయమన్నారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. బెటాలియన్లలో పని చేస్తోన్న పోలీస్ కానిస్టేబుళ్ల చేత కూలీ పనులు చేయిస్తున్నారని, తక్షణమే వన్ పోలీస్ విధానం అమలు చేయాలని కానిస్టేబుళ్ల భార్యలు ఆందోళనకు దిగారు. బెటాలియన్ల ముందు ధర్నాకు దిగిన కానిస్టేబుళ్ల భార్యలను మహిళా పోలీసులు అదుపులోకి తీసుకొని బలవంతంగా జీపు ఎక్కించారు. ఈ ఘటనపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. ముఖ్యమంత్రికి పోలీసు కుటుంబాల బాధల గురించి వినే సమయం లేనట్లుగా ఉందని, కనీసం మీరైనా తక్షణమే స్పందించి, సున్నితమైన ఈ సమస్యను పరిష్కరించాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. పోలీసుల మనసుల్లో అశాంతి ఉండకూడదన్నారు. అశాంతిని దరిచేరనీయకుండా చూడాలన్న విషయం పోలీసు బాసుగా మీకు తెలియంది కాదన్నారు. ఈ వివాదం మరింత ముదిరితే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మరింత విషమిస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే హత్యలు జరుగుతున్నా పట్టించుకునే వాళ్లు కరవయ్యారని, అందుకే దయచేసి కొంతకాలం పాత పద్దతిలోనే రికార్డెడ్ పర్మిషన్‌ని కొనసాగించాలని సూచించారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అప్పుడు కొత్త పంథాను అనుసరించాలని సూచించారు. పోలీసులే తమ సోదరుల భార్యలను ఈడ్చుకుంటూ పోవడం చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు ఏ డీజీపీ ఈ పరిస్థితిని రానివ్వలేదని, మీరూ రాకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు.

---

# సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఖన్నా



హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకానికి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆమోదముద్ర వేశారు. సంజీవ్ ఖన్నా నవంబర్ 11న సీజేఐగా ప్రమాణ స్వీకారం చేస్తారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ వెల్లడించారు. ప్రస్తుత సీజేఐ డీవై చంద్రచూడ్ పదవీ కాలం నవంబర్ 10న ముగియనుంది. దీంతో జస్టిస్ ఖన్నా పేరును చంద్రచూడ్ సిఫార్సు చేయగా... రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. దీంతో వచ్చే నెల 11వ తేదీన సుప్రీంకోర్టు 51వ సీజేఐగా జస్టిస్ ఖన్నా బాధ్యతలు స్వీకరించనున్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా 2025 మే 13వ తేదీ వరకు సీజేఐగా కొనసాగుతారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. తీస్‌హజారీ జిల్లా కోర్టు, హైకోర్టు, ట్రైబ్యునళ్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2005లో ఢిల్లీ హైకోర్టులో అదనపు జడ్జిగా నియమితులయ్యారు. 2006లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

---

# కేటీఆర్‌పై నిప్పులు చెరిగిన మంత్రి సీతక్క



హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారం కోల్పోయాక ఆయన కావాలనే ప్రభుత్వంపై దూషణకు దిగుతున్నారని, కానీ అలాంటి వాటిని సహించేది లేదని హెచ్చరించారు. పదేళ్లు మంత్రిగా వెలగబెట్టిన కేటీఆర్ అధికారం కోల్పోయాక సభ్యత, సంస్కారం మరిచి మాట్లాడుతున్నారని, అలాగే మాట్లాడితే తగిన రీతిలో సమాధానం చెబుతామన్నారు. ముఖ్యమంత్రి కుర్చీని అవమానించేలా మాట్లాడవద్దన్నారు. ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని సీతక్క ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో అన్నదాతలను పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు దొంగ ఏడుపు ఏడుస్తున్నారని విమర్శించారు. పంట రుణమాఫీ చేయని బీఆర్ఎస్‌ను ప్రజలు, రైతులు గత ఎన్నికల్లో ఘోరంగా ఓడించారన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం ఏకకాలంలో రుణమాఫీ చేసిందన్నారు. రైతులకు ఉచిత ఎరువులు, సన్నాలకు రూ.500 బోనస్ వంటి హామీలను ఇచ్చి అమలు చేశామన్నారు. పంట బీమా పథకం లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్ల కొనుగోలుకు 7,248 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తమ ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు తాము వడ్డీ చెల్లించే పరిస్థితి వచ్చిందని సీతక్క వాపోయారు.

---

# ఎల్ఆర్ఎస్ పేరిట క్రమబద్ధీకరించింది వాళ్లే... మొసలి కన్నీరు కారుస్తోంది వాళ్లే



హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరిట క్రమబద్ధీకరణ చేసిన భూములనే బీఆర్ఎస్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేదలకు విక్రయించారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇప్పుడు ఆ బీఆర్ఎస్ పార్టీ నేతలే మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఇక, డీపీఆర్ లేకుండా మార్కింగ్ ఎలా చేస్తావని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. నిన్ను ఎన్నుకుంటే పేదల బతుకు ఇట్లా ఆగం చేస్తావా? అని మండిపడ్డారు. ఈరోజు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం దేనికని ప్రశ్నించారు. మూసీ విషయంలో ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరును తమ పార్టీ ఖండిస్తోందన్నారు. ఈ ప్రభుత్వం చెరువులను అన్నింటినీ క్లీన్ చేస్తే అభినందిస్తామన్నారు. డ్రైనేజీ నీరు మూసీలో కలవకుండా చూడాలన్నారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, అందులో విష రసాయనాలు కలుస్తున్నాయన్నారు.గత ముఖ్యమంత్రి హుస్సేన్ సాగర్‌ను ఎందుకు క్లీన్ చేయలేదని ప్రశ్నించారు. సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా? అని నిలదీశారు. పేదల ఉసురు మంచిది కాదన్నారు. హైడ్రా పేరుతో కూల్చివేతలు జరిపితే బుల్డోజర్లకు అడ్డుపడతామన్నారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ రేపు జరగనున్న మహాధర్నాకు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

# ఆ అధికారుల పేర్లను రాసి పెట్టండి



హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : అక్రమ కేసులు పెట్టి వేధించే అధికారుల పేర్లను రాసి పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నేతలకు సూచించారు. పైనుంచి వచ్చే ఒత్తిడితో అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అలాంటి అధికారులకు మిత్తి (వడ్డీ)తో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు పోరుబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... రైతుల కోసం తాము ఎంత దూరమైనా వెళతామన్నారు. అవసరమైతే జైలుకైనా వెళతామన్నారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదని మండిపడ్డారు. ఏ ఒక్క హామీని నెరవేర్చని కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ప్రజలు పోలీస్ స్టేషన్ల ముందు వరుస కడితే కాంగ్రెస్ నేతల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

---


# మూసీ వద్ద ఇళ్ల కూల్చివేతను వ్యతిరేకిస్తున్నాం



హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : మూసీ నిర్వాసితుల ఇళ్ల కూల్చివేతను తాము వ్యతిరేకిస్తున్నామని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టును నిన్నటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటీఎంలా మార్చుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నదిని ఏటీఎంలా మార్చుకునే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. మూసీ ప్రక్షాళన పేరుతో పరీవాహక ప్రాంతంలోని నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం లక్షన్నర కోట్ల రూపాయల అప్పు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వడ్డీల రూపంలో పది నెలల్లోనే రూ.60 వేల కోట్లు చెల్లించారన్నారు. పాలకులు చేస్తున్న అప్పుల కారణంగా రాష్ట్రంపై, ప్రజలపై భారం పడుతోందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అయితే ఈ ప్రభుత్వ దోపిడీ, హైడ్రా పేరుతో పేదల ఇళ్ల కూల్చివేతకు మాత్రం తాము వ్యతిరేకమన్నారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈ రోజు ఇందిరా పార్క్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపడుతున్నట్లు తెలిపారు.

---

# తెలంగాణలో కరెంట్ షాక్ తప్పదా..!



హైదరాబాద్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణలో విద్యుత్ చార్జీలు పెంచాలన్న డిస్కమ్‌ల ప్రతిపాదనలపై ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ERC ఇప్పటికే చర్చలు ప్రారంభించింది. హైదరాబాద్ కల్యాణ్‌నగర్ ట్రాన్స్‌కో ఆఫీసులో జరిగిన బహిరంగ విచారణలో విద్యుత్ చార్జీలపై చర్చలు జరిగాయి. తెలంగాణ డిస్కమ్ తమ ప్రతిపాదనలను ఈఆర్సీకి సమర్పించింది. పంపిణీ నష్టాలను 4.75 శాతానికి తగ్గించామని, ప్రతీ యూనిట్‌కి 6రూపాయల 45పైసలు స్పెసిఫిక్ రెవెన్యూ వస్తోందని ఈఆర్సీకి నివేదించారు . నెలకు 300 యూనిట్లకు పైగా వినియోగించే గృహ వినియోగదారుల ఫిక్స్‌డ్ ఛార్జీలపై స్వల్ప పెంపును ప్రతిపాదించింది TGSPDCL. పేద, మధ్య తరగతి గృహ వినియోగదారులపై ఎలాంటి భారం వేయటంలేదని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పేర్కొన్నారు.అయితే.. లోటును భర్తీచేసేందుకు మూడు కేటగిరీల్లో చార్జీలను సవరించాలని డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. ఈఆర్సీ ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తే 1200 కోట్ల ఆదాయం వస్తుందని డిస్కమ్‌లు అంచనావేస్తున్నాయి. అయితే డిస్కమ్‌ల ప్రతిపాదనలను ఆమోదించవద్దని బహిరంగవిచారణకు ముందే ఈఆర్సీ ఛైర్మన్‌ని కలిశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. అయితే.. తెలంగాణలో విద్యుత్‌చార్జీలు పెరగబోతున్నాయన్న బీఆర్ఎస్ , ఈఆర్సీ బహిరంగ విచారణలో తన వాదన వినిపించింది. ఈ ప్రతిపాదనలను విటో చేయాలని బీఆర్ఎస్.. ఈఆర్సీని కోరింది.కాంగ్రెస్ ప్రభుత్వం డిస్కంలతో వ్యాపారం చేస్తోందని బీఆర్ఎస్ లీడర్లు మధుసూదనాచారి, మహమూద్ అలీ ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు పెంచొద్దని ఈఆర్సీకి తమ అభిప్రాయం చెప్పామన్నారు. విద్యుత్ డిమాండ్‌ని కావాలని అధికంగా చూపెడుతున్నారని వాదించారు విద్యుత్ రంగ నిపుణుడు వేణుగోపాల్. డిస్కంల ఏఆర్ఆర్‌లతో వచ్చే ఐదు నెలల్లో సుమారు మూడు వేల కోట్ల భారం పడుతుందని అంచనావేశారు. ఛార్జీలు పెంచకుండానే భారం వేయాలని విద్యుత్ సంస్థలు చూస్తున్నాయన్నారు.అయితే.. చార్జీల సవరణల ప్రతిపాదనలపై కనీసం మూడుచోట్ల పబ్లిక్ హియరింగ్‌ల తర్వాతే ఈఆర్సీ తుదినిర్ణయం ప్రకటిస్తుంది. ప్రజలపై భారం పడకుండా, విద్యుత్ సంస్థలను ఆదుకునేందుకు అవసరమైన యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించినట్లు చెబుతున్నారు.




# శ్రమ దోపిడీకి గురవుతున్న మున్సిపల్ కార్మికులు

**- మాటలు వద్దు మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచండి**

**- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం. యాదగిరి**

**- చాలీ చాలని వేతనాలతో మున్సిపల్ కార్మికుల బతుకులు**



సంగారెడ్డి,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : మున్సిపల్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని మున్సిపల్ కార్మికులందరికీ పర్మనెంట్ చేసి, పెరిగిన వేతనం వాటర్ సప్లై, బిల్ కలెక్టర్, ఆఫీసులో స్టాప్ కు ఎలక్ట్రిషన్, కార్మికులందరికీ అమలు చేయాలని ఈనెల 25 చలో సీ డి ఎం ఏ ఆఫీస్ ని ముట్టడి చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి కార్మికులకు పిలుపునిచ్చారు ఈరోజు స్థానిక సుందరయ్య భవన్లో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం, యాదగిరి మాట్లాడుతూ మున్సిపల్ లో కాంట్రాక్ట్ కార్మికులుగా అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనంతో కార్మికులు పనిచేస్తున్న, వీరి శ్రమను ప్రభుత్వాలు గుర్తించక పోగ, ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న మునిసిపల్ కార్మికులకు అన్యాయమే జరుగుతుందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మునిసిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రెండో పి ఆర్ సి లో కనీస వేతన 26,000 రూపాయలతో పాటు కేటగిరీలవారిగా వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల వాలే మునిసిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు డి ఏ అమలు చేయాలని, కార్మికులు చనిపోతే మట్టి ఖర్చులు నిమిత్తం 30 వేలు ఇవ్వాలని తక్షణ సాయంగా ఆ కుటుంబానికి అదుకోవాలని కార్మికులకు వర్ష కాలంలో రెయిన్ కోట్లు, చలికాలంలో స్వెటర్లు, సంవత్సరానికి ఒక్కసారి తప్పనిసరిగా సబ్బులు, బట్టలు, కొబ్బరి నూనె, షులు ఇతర సామాగ్రిని అందించాలని, వివిధ విభాగాలలో పనిచేస్తున్న వృత్తి నైపుణ్యాన్ని గుర్తించి డ్రైవర్లుగా, సానిటరీ ఇన్స్పెక్టర్ గా కంప్యూటర్ ఆపరేటర్లుగా మొదటి ప్రాధాన్యతనిచ్చి ప్రమోషన్లు కల్పించాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు 25 లక్షల భీమా చేపించాలి. పిఎఫ్ , ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాలలో కొన్ని మునిసిపాలిటీలలో జమ చేయడం లేదని మున్సిపాలిటీ అధికారులు బాద్యుతులపై చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలకు, అనారోగ్యాలకి గురైన మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సాయం అందించడం లేదు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన వెయ్యి రూపాయలు కార్మికులందరికీ వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేనిపక్షంలో పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు పై డిమాండ్లన్నీ అమలు చేయకుంటే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, శీను, లక్ష్మణ్ యాదగిరి, నర్సింలు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

---

# ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కు

**- అత్యవసర వైద్య సేవలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలకం**

**- నిరుపేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడానికి కృషి**



హత్నూర,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ లో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ రూ. 156 లక్షలతో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌల్తాబాద్ గ్రామంలో రూ:156 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామాత్యులు రాజనర్సింహ, మెదక్ ఇంఛార్జ్ మంత్రి, అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, టి జి ఐ సి సి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నర్సాపూర్ , దౌల్తాబాద్ ప్రాంతంలో నర్సాపూర్-సంగారెడ్డి రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరగడం వల్ల ప్రజలకు అత్యవసర వైద్యం అందించడంలోఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి దామోదర్ అన్నారు. నర్సాపూర్ - సంగారెడ్డి రోడ్ లో గతంలో అనేక ప్రమాదాలు జరగగా, అటువంటి సంఘటనలకు సత్వర వైద్యం అందించడానికి ఈ ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి దామోదర్ అన్నారు. దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్, వైద్యాధికారులను ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలకు సమానంగా వైద్య ఆరోగ్య సేవలు అందించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని, పేదవారికి ఉచిత వైద్యం అందించడంలో ఏ లోటు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. "ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కు" అంటూ, ప్రజలకు సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆరోగ్యం మాత్రమే కాదు, ఆరోగ్య విద్య, పర్యావరణం, సామాజిక ఆరోగ్యం వంటి అంశాలకు తెలంగాణ ప్రభుత్వం ప్రాముఖ్యత నిస్తుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ ఆరోగ్యం కాపాడుతామని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దౌల్తాబాద్ కేంద్రం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి వీలైనంత త్వరగా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మంత్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఅధికారి గాయత్రీ ,ఆర్ డి ఓ రాజు, తహసీల్దార్ ఫరీనా షేక్, డాక్టర్ దివ్య జ్యోతి, ప్రజాప్రతినిధులు మదన్ రెడ్డి,ఆవుల రాజిరెడ్డి, రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సుజాత సత్యం, హకీమ్ మండల అధ్యక్షులు కృష్ణ, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, మాజీ ఎంపీపీ వావిలాల నరసింహులు, వీరేశం గౌడ్, నర్సింహారెడ్డి, రామచంద్రారెడ్డి, నాయకులు కార్యకర్తలు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ వల్లూరి క్రాంతి

**- పదవ తరగతి లో శత శాతం ఫలితాలు సాధించాలి**



హత్నూర,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ నెల్లూరు క్రాంతి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ ఏడాది పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధన కోసం ఇప్పటి నుండి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యార్థులను ప్రతిభా ఆధారంగా గ్రూపులుగా విభజించి వారి సామర్థ్యాల పెంపొందించడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో తహశీల్దార్ పర్వీన్ షేక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

---

# బీవీఆర్ఐటీ కళాశాలలో రక్తదాన శిబిరం విజయవంతం




నర్సాపూర్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపల్ సంజయ్ దుబే, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ఎస్ వి ఇఎస్ డైరెక్టర్ రవీంద్రబాబు, హెచ్ఓడి డాక్టర్ దశరథ రామయ్య, సందీప్లు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో విద్యార్థులు కళాశాల సిబ్బంది స్థానికులు అందరూ కలిసి సుమారుగా 250 మందికి పైగా ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సకాలంలో రక్తము అందజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. అంతేకాకుండా రక్తందానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి రక్తం అత్యవసరమైన వారికి సకాలంలో ప్రాణాలు కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఇలాంటి సమాజానికి ఉపయోగ పడే కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. రక్తం అవసరం ఉన్న వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రతి ఒక్కరికి ఉపయోగపడుతుందని వారు అన్నారు. ఈ శిబిరాన్ని అందరూ కలిసి ఉత్సాహంతో ముందుకొచ్చి స్వచ్ఛందంగా రక్తాన్ని ఇచ్చి ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

---

# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తాం

**-మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే టి హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన మండల బిఆర్ఎస్ నాయకులు**



గుమ్మడిదల,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తామని నూతనంగా ఎన్నికైన గుమ్మడిదల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి అన్నారు గురువారం రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కొలను బాల్ రెడ్డి, తో పాటు మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు రాష్ట్ర మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే టి హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలువురు నాయకులు మాట్లాడుతూ గుమ్మడిదల మండలంతో పాటు వివిధ మండలాలలో ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తూ ప్రజల్లో ఉంటామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజా క్షేత్రంలో బిఆర్ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకుందాంమని తెలిపారు. కార్యక్రమంలో నూతన కమిటీ ఉపాధ్యక్షులు కొత్తపల్లి మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నరహరి, నాయకులు జి వెంకటేశం గౌడ్, మంద భాస్కర్, సంతోష్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదిరెడ్డి, లక్ష్మణ్, పద్మా రెడ్డి సంజీవరెడ్డి, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

# మల్లేపల్లి లో సీసీ రోడ్ పనులు ప్రారంభం



కొండాపూర్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : ఎంజిఎన్ఆర్ఇజిఎస్ 12 లక్షలు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మంజూరు చేయగా. ఐదు లక్షల మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఈసీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేశారు. పనులను గురువారం నాడు ప్రారంభించారు గ్రామ ప్రత్యేక అధికారి మర్రి ప్రదీప్.కార్యదర్శి శ్రీనివాస్.మాజీ జెడ్పీటీసీ పద్మావతి పాండురంగ, మాజీ ఎంపీటీసీ రాందాస్,సర్పంచ్ శివలిల జగదీష్, ఎదుర్గుడెం మనెయ్య, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్.మాజీ ఉపసర్పంచ్ రామప్ప, వార్డ్ మెంబెర్స్ రాజిరెడ్డి,లక్ష్మారెడ్డి,పండు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగటం అడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్**




సంగారెడ్డి,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్రంలో పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ అన్నారు. గురవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఇనిస్ట్యూట్ బేస్డ్ అర్గనైజేషన్ తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 8 వేల కోట్ల దాకా ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ పెండింగ్లో ఉన్నాయన్నారు రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యార్థులు గత మూడు సంవత్సరాల నుండి పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమాన్యాలు మేము కాలేజీలు నడపలేమని బంధు నిర్వహించి దీక్షలు చేపట్టారన్నారు. ప్రైవేటు యజమాన్యాలు కళాశాలలు బందు పెట్టడం వలన విద్యార్థులు అయోమయంలో పడుతున్నారన్నారు ఇంత జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు విద్య రంగా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులలకు సొంత భవనాలు లేవన్నారు. అద్దె భవనాల్లో ఉండడం వలన దసరా సెలవులు అయిపోయిన తర్వాత గురుకులాలకు వెళ్తే ప్రభుత్వం ఆ అద్దె భవనాల కిరాయి చెల్లించకపోవడంతో అక్కడ ఉన్నటువంటి భవనాల యజమానులు గేట్లకు తాళాలు వేసిన పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఉందన్నారు. ఇంత జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు అలాగే తెలంగాణ రాష్ట్రానికి విద్య శాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యల పైన స్పందించి పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ ను అలాగే స్కాలర్షిప్స్ ను వెంటనే విడుదల చేయాలని, అలాగే రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులలకు సొంత భవనాలు నిర్మించాలి అని అన్నారు లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ,దుర్గరెడ్డి ,కుమార్, అభిషేక్, సాయి , రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

---

# త్వరలో రాష్ట్రంలో నూతనంగా 5 క్యాన్సర్ కేంద్రాల ఏర్పాటు

**- డయాబెటిస్, క్యాన్సర్, బిపి గుండె సంబంధిత వ్యాధులపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన**

**- 90 శాతం వైద్యం స్థానిక ప్రాంతంలోనే జరగాలి, నగరాలకు వైద్యం కోసం వెళ్లకూడదు**

**- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**



మెదక్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : మెదక్ పట్టణంలోని పిల్లి కొట్యాల్ లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల లోని ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రులు దామోదర్ రాజనర్సింహ, దేవాదాయ ,ధర్మాదాయ పర్యాటక శాఖ మంత్రి కొండ సురేఖ ఎంపీ రఘునందన్ రావు, మెదక్ ఎమ్మెల్యే మదనపల్లి రోహిత్ రావ్, ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవీందర్ లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్క పౌరునికి ఉచిత నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, త్వరలో రాష్ట్రంలో నూతనంగా 5 క్యాన్సర్ కేంద్రాల ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. డయాబెటిస్ క్యాన్సర్ బిపి గుండె సంబంధిత వ్యాధుల సమస్యలపై గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. త్వరలో మొబైల్ స్క్రీనింగ్ సెంటర్ల యూనిట్ను ఏర్పాటు చేయాలన్నారు. హైవే ప్రమాదాల తక్షణ వైద్య సేవల కోసం 74 ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు చేయాలన్నారు. 220 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల, అన్ని రకాల మౌలిక వసతులను వచ్చే విద్యా సంవత్సరం వరకు ప్రారంభించుకోవాలన్నారు. ధర్మాదాయ దేవాదాయ పర్యావరణ శాఖామంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ విద్యార్థులు వైద్య వృత్తికి న్యాయం చేయాలని, వైద్యవృత్తి చదువుతూనే టెక్నాలజీతో పోటీపడాలన్నారు. వైద్య సేవలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సేవ చేయాలని యువ డాక్టర్లకు పిలుపునిచ్చారు ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక మెడికల్ కళాశాలలను మంజూరు చేసిందని, పేద ప్రజలకు న్యాయం చేసి మంచి వైద్యం అందించాలన్నారు. దేశవ్యాప్తంగా ఒక లక్ష ఏడు వేల ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులో ఉన్నయాన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ,ఇరవై ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని, సభాముఖంగా మంత్రివర్యులకు వివరించారు. ఎమ్మెల్యే వైనంపల్లి రోహిత్ రావ్, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ ప్రజల చిరకాల కోరిక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని, మెదక్ వెనకబడిన ప్రాంతానికి మెడికల్ కాలేజీ రావడం జిల్లా ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ తరగతుల ప్రారంభోత్సవం చేయడం సంతోషకరమని ఈ ప్రాంత ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని, విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలను అధిరోహించలని, మెడికల్ కళాశాల కోసం చాలామంది కష్టపడ్డారని వారి కష్టానికి ఫలితం దక్కిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం


**- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ**



మెదక్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా, నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం మెదక్ జిల్లా పిల్లి కొట్యల్ లో వైద్య కళాశాల ఎంబీబీఎస్ ప్రారంభోత్సవం అనంతరం వైద్యం వ్యవసాయం, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మార్కెటింగ్ సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనరసింహ మాట్లాడుతూ జిల్లా సమర్థవంతమైన పాలన లక్ష్యంగా ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలని వ్యవసాయపరంగా రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించి రైతులకు సకాలంలో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎన్ని నిర్వహిస్తున్నారు కొనుగోలు సక్రమంగా నడుస్తుందా రవాణా విషయంలో తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా అనే విషయాలను జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా సమగ్ర నివేదికలు అడిగి తెలుసుకుని క్షేత్రస్థాయిలో లోటుపాట్లను సరిదిద్దుకొని పని చేయాలన్నారు. రుణమాఫీకి సంబంధించి ఎంతమంది రైతులు లబ్ధి పొందారు. ఇంకా ఎవరెవరికి రుణమాఫీ చేయాల్సి ఉంది, బ్యాంకులతో ఏమైనా సమస్య ఉన్నదా, అనే విషయాలపై సమగ్ర నివేదిక తయారు చేయాలని, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందుని ఆదేశించారు, మార్కెటింగ్ శాఖ ద్వారా పత్తి కొనుగోలు సక్రమంగా నడుస్తుందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

---

# సి యం ఆర్ ఎఫ్ చెక్కులను అందజేసిన నారాయణఖే మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి





నారాయణఖేడ్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని మంగల్ పేట్ కు చెందిన రుక్మిణికి 18,500, నమ్లి మిట్ గ్రామానికి చెందిన లచ్చవ్వ కి ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 60,000 రూపాయల చెక్కును అందజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి అనంతరం నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన సాయిలు ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 8,500 రూపాయల చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అభిషేక్ షట్కార్ లక్ష్మారెడ్డి, నార్య నాయక్, సాయిలు,విజయ్ తదితరులు ఉన్నారు.

---

# అక్రమంగా తరలిస్తున్న 50 కేజీల గంజాయి



పటాన్ చెరువు,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా బిడిఎల్ పోలీస్ పరిధిలోనే కర్దనూర్ అవుటర్ రింగ్ రోడ్డు వద్ద ఒరిస్సా నుంచి కర్ణాటక వైపునకు అక్రమంగా తరలిస్తున్న 50 కిలోల గంజాయిని పట్టుకున్న డి.ఎస్.పి రవీందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గంజాయి విలువ 12 లక్షల 50 వేల రూపాయలు ఉంటుందని డిఎస్పి రవీందర్ ప్రెస్ మీట్ లో వెల్లడించారు.

---

# భర్త వేరొక స్త్రీ తో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని భార్య ఆత్మహత్యా



సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : అమీన్పూర్ మండలంలోని ఐలాపూర్ గ్రామ నివాసి అయినా కే అశోక్ కుమార్ ఒక సివిల్ కాంట్రాక్టర్ దగ్గర సూపర్వైజర్ గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా అశోక్ కుమార్ పని చేసే స్థలం వద్ద వేరొక స్త్రీ తో అక్రమ సంబంధం పెట్టుకొని అప్పుడప్పుడు అతని ఇంటికి అట్టి స్త్రీని తీసుకుని వెళ్లేవాడు ప్రతి విషయంలో అశోక్ కుమార్ భార్య కే సునీత వయసు 44 సంవత్సరాలు వృత్తి గృహిణి అడుగగా ఆమెను మానసికంగా మరియు శారీరకంగా వేధించేవాడు. అదేవిధంగా తేదీ 23-10-2024 నాడు రాత్రి అశోక్ కుమార్ ఇంటికి రాకపోవడంతో అట్టి అక్రమ సంబంధం పెట్టుకున్న స్త్రీ తోటే ఉన్నాడని అతని భార్య సునీత మనస్థాపం చెంది తన ఇంట్లో ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. ఇట్టి విషయమును మృతురాలు అన్న అయినా కొయ్య శ్రీను తండ్రి కొయ్య సుబ్బారావు వృత్తి వెల్డింగ్ పని స్వగ్రామము మల్లవరం లంక నరసాపురం మండలం పశ్చిమగోదావరి జిల్లా ప్రస్తుత నివాసము అల్వాల్ సికింద్రాబాద్ కి ఐలాపూర్ సర్పంచ్ మల్లేష్ గారు ఫోన్ ద్వారా తెలియపరచగా ఫిర్యాది కొయ్య శ్రీను గారు వచ్చి చూడగా అతని చెల్లెలు సునీత నిజంగానే చనిపోయి ఉన్నది. ఇట్టి విషయంలో మృతురాలి అన్న కొయ్య శ్రీను తన చెల్లెలు చావుకు తన బావ అయిన అశోక్ కారణమని అతని వేధింపుల వల్లే మరియు అక్రమ సంబంధం కారణంగా తన చెల్లెలు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని చనిపోయినదని తన బావ అశోక్ పై తగు చర్య గురించి ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అమీన్పూర్ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు తెలిపారు.

# భక్త మార్కండేయుడు చిరంజీవుడు

**- మాధవానంద సరస్వతి**



నారాయణఖేడ్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : భక్త మార్కండేయుడు చిరంజీవుడని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. గురువారం నారాయణఖేడ్ వెంకటాపూర్ కమాన్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న మార్కండేయ భవను మందిరాన్ని సందర్శించి ప్రవచనం చేశారు. నారాయణఖేడ్ పట్టణంలో పద్మశాలీల ఆధ్వర్యంలో భక్త మార్కండేయ ఆలయం నిర్మించడం దైవ నిర్ణయమేనని కొనియాడారు.మార్కండేయుడు అతి చిన్న వయసులోని తన అద్భుత తపస్సుతో సాక్షాత్ పరమేశ్వరుని కరుణా కటాక్షాలు పొంది చిరంజీవిగా ఆశీర్వదించబడడం అత్యంత గొప్ప విషయమని, మామూలు వ్యక్తులకు అది అనితర సాధ్యమని పేర్కొన్నారు.అనుకున్నవి అనుకున్నట్టు జరిగినా, అనుకోనివి జరిగినా, జరగకూడని జరిగినా అన్నిటికీ భగవత్ సంకల్పనే కారణమన్నారు. మానవ జన్మ పరిపూర్ణం సాధించాలంటే భక్తి మార్గం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కులబాంధవులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

**- మీడియా సమావేశంలో పటాన్ చెరు డి.ఎస్.పి రవీందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ**





సంగారెడ్డి క్రైం,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే భారత్ డైనమిక్ లిమిటెడ్(బి.డి.ఎల్) పోలీస్ స్టేషన్ ఆవరణలోకి వచ్చే బాహ్య వలయ రహదారి( ఔటర్ రింగ్ రోడ్ ) లో గత రాత్రి వాహనాలు తనిఖీలు చేయుచుండగా 50 కిలోల ఎండు గంజాయి అక్రమంగా సరఫరా చేస్తున్నారని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో భాగంగా పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తులని వ్యక్తులని పోలీస్ ల అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టి దర్యాప్తు చేస్తున్నామని పటాన్ చెరు డి.ఎస్.పి రవీందర్ రెడ్డి మీడియాతో తెలిపారు.ఈ మీడియా సమావేశంలో పటాన్ చెరు డి.ఎస్.పి మాట్లాడుతూ ఎవరైనా సరే గంజాయి స్వీకరించిన అమ్మిన అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ లు ఉన్నారు.

# ప్రయాణం.. ప్రాణసంకటం..

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- అస్తవ్యస్త రోడ్లతో అవస్థలు పడుతున్న జనాలు
- రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు
- రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా మెరుగుపడని రవాణా వ్యవస్థ






కొండాపూర్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : చంద్రయాన్ లాంటి ప్రయోగంతో దేశం చందమామను అందుకుంటున్నా.. దేశవిదేశాలకు మన రాష్ట్రం నుంచి విమాన సర్వీసులు అందిస్తున్న మారుమూల ప్రాంతాల్లో కనీస రవాణా సౌకర్యం లేక కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తికావడం లేదు. అనేకచోట్ల నాణ్యతను పాటించడం లేదు. ఫలితంగా గ్రామీణులకు అస్తవ్యస్త రోడ్లపై ప్రయాణం నిత్య నరకంలా మారుతోంది. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా గుంతల మయంగా తయారయ్యాయి. ప్రధాన రహదారుల తోపాటు గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లు కూడా అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మారేపల్లి నుండి సిద్దాపూర్ మీదుగా సదాశివపేట మీదుగా వెళ్లే 65వ నంబరు జాతీయ రహదారిని కలిపే రింగ్ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. మారేపల్లి నుండి ఇ ఈ సదాశివపేట 65వ నంబరు జాతీయ రహదారిని కలిపే లింక్ రోడ్డు పొడవునా మొత్తం పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంత లతోపాటు రోడ్డుకిరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్గమధ్యలో రైతులు తమ వ్యవసాయ పొలాల్లో కి వెళ్లేటప్పుడు ఈ రహదారి నీటి మడుగును తలపిస్తోంది. సిద్దాపూర్ నుంచి శివన్న గ్రామానికి దగ్గర ఉన్న శంకర్పల్లి మోమిన్పేట్ ప్రధాన రహదారికి కలిపే ఈ లింకు రోడ్డుకు ప్రత్యేక నిధులు కేటాయించి రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు వాహనదారులు గ్రామస్తులు మెతుకు సీమ పత్రిక ద్వారాకోరుతున్నారు.

# సీసీఐ ద్వారా ప్రత్తి కొనుగోళ్లు చేపట్టాలి

**- మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి**




రాయికోడ్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో గురువారం నాడు చైర్మన్ అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి ముఖ్య అథితిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ గోదాం, ప్రహారి గోడ, సీసీఐ ప్రత్తి కొనుగోలు మరియు మీటింగ్ హాల్ గురించి చర్చించడం జరింగిందన్నారు. సమావేశ అనంతరం నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ వినయ్ లను మండల ప్రత్యేక అధికారి జగదీష్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో డిఎంఓ రియాజ్, మండల వ్యవసాయ అధికారి సారిక, మార్కెట్ సెక్రటరీ రవికుమార్ మరియు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలికి వీడ్కోలు



రాయికోడ్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం అల్లాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు సన్విత సాయి వేరొక పాఠశాలకు బదిలీ అయ్యారు.ఇన్నిరోజులు గ్రామంలో సేవలందించినదుకు గాను వారిని తాజా మాజీ సర్పంచ్ ప్రవీణ్ శాలువాతో సన్మానించి వీడ్కోలు తెలిపి అనంతరం పాఠశాలకు నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుడిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతి ధాన్యం గింజ కొంటాం

**- రైతులెవరు ఆందోళన చెందవద్దు**





నారాయణఖేడ్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని నారాయణఖేడ్ శాసనసభ్యులు సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో ఐకెపి కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే మ ప్రభుత్వ ధ్యేయం, రైతు పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది, రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధరను అందిస్తాం, రైతులకు అన్ని విధాలుగా మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కొరకు కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐకెపి అధికారులు, కాంగ్రెస్ నాయకులు రమేష్ చౌహాన్,పండరి రెడ్డి, అశోక్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్, ఈశ్వరప్ప, శంకర్ ముదిరాజ్, దత్తు గౌడ్,నరసింహ రెడ్డి, నెహ్రూ నాయక్, జ్ఞానేశ్వర్ రెడ్డి, అశోక్ రెడ్డి మాజీ ఎంపీటీసీ,రాజు నాయక్,శివ కుమార్,ఎంకన్న సాగర్, రైతులు, పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు ప్రభుత్వం ఇబ్బంది పెట్టొద్దు



నారాయణఖేడ్,అక్టోబర్ 25 ( మెతుకు సీమ న్యూస్) : నిరుపేద విద్యార్థుల యొక్క స్కాలర్షిప్ వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులకు ఆదుకోవాలని ఏబీవీపీ నారాయణఖేడ్ సంయుక్త కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కలశాలలకు రావాల్సిన ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్షిప్ లు దాదాపు 7800కోట్లు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. దీని కారణంగా వివిధ కళాశాలలో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎంతో మంది విద్యార్థులు విద్య కు దూరం కావాల్సిన పరిస్థితి, మరోవైపు తెలంగాణ లో నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకున్న పాపాన పోలేదు కనీసం విద్యా శాఖకు మంత్రి లేకపోవడం రాష్ట్ర ముఖ్యమంత్రి కి విద్యారంగం మీద ఉన్న చిత్త శుద్ధి అర్థం అవుతుందని అన్నారు. ఈ ప్రభుత్వంతో విద్యార్థులకు ఎలాంటి న్యాయం జరగడం లేదు. స్కాలర్షిప్ లు రాని కారణంగా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్ళాలి అంటే సర్టిఫికేట్ అవసరం కానీ కలశాల యాజమాన్యం ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికేట్ ఇస్తామని విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. గత కొన్ని రోజులుగా ప్రవేటు యాజమాన్యం రోడ్డెక్కి ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు అయిన ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వానికీ సోయి లేకుండా పోయింది.కాబట్టి విద్యార్థులకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేశారు.లేని పక్షంలో విద్యార్థుల పక్షాన తప్పకుండా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని, అలాగే పెండింగ్ లో ఉన్న 7800 కోట్లు స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయకపోతే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విజయ్. పవన్ రెడ్డి. విగ్నేష్. అభిలాష్. చందు. ప్రశాంత్. నాని. జ్ఞానేశ్వర్. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com